క్లుప్తంగా

లక్ష్మీనృసింహ స్వామికి ముడుపుల పూజలు

సీతానగరం: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మితమైన లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో ముడుపుల పూజలు ఘనంగా జరిగాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

నిరుపేద కుటుంబానికి వితరణ



బాధిత కుటుంబానికి వితరణ అందిస్తున్న సంజీవినాయుడు

బలిజిపేట: పెదపెంకి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి రూ.10,200లు వితరణగా అందించామని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవినాయుడు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించేందుకు గ్రామంలో తిరిగి ఈ మొత్తాన్ని సేకరించామని చెప్పారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ జీవనోపాధికి కష్టంగా ఉండడంతో దీనిని తెలుసుకుని యువకుల సహకారంతో గ్రామంలో అందరిని కలిసి విషయాన్ని వివరించగా యువకులు, పెద్దలు అందరు ఇచ్చిన వితరణ మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందించామన్నారు. కార్యక్రమంలో పి.భాస్కర్, యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రగతి సాధించాలి



మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాల వద్ద నివాళులు

పార్వతీపురం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలందించి పల్లెలు ప్రగతి పథంలో నడిపేందుకు ప్రతీ ఒక్క అధికారి కృషి చేయాలని డీఎల్‌డీఓ జీవీ రమణమూర్తి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం పార్వతీపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు మండల ప్రజా పరిషత్ సిబ్బందితో కలసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పాలన వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించడంలో పంచాయతీరాజ్ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తాయని గ్రామీణాభివృద్ధి ప్రోత్సహించడంలో, సామాజిక సాధికారతలో వీటి పాత్రలను ప్రజలకు కూడా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.


రహదారి నిబంధనలు పాటించండి



వాహనాలను తనిఖీ చేస్తున్న రూరల్ ఎస్‌ఐ బి. సంతోషి

పార్వతీపురం రూరల్: వాహన చోదకులు కచ్చితంగా రహదారి నిబంధనలు పాటించాలని రూరల్ ఎస్‌ఐ బి.సంతోషి సూచించారు. మండలంలోని పలు కూడళ్లలో ఆకస్మికంగా తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు గురువారం చేపట్టారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

సాలూరు రూరల్: మండలం కురుకూటి పంచాయతీ సులారి గ్రామ సమీపంలో సారా తయారీ కేంద్రాలపై గురువారం సాలూరు రూరల్ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఉమ్మడిగా దాడి చేసి 16 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు రూరల్ ఎస్‌ఐ నరసింహమూర్తి తెలిపారు. బెల్లం ఊటతో పాటు 3 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

శిథిలం...!



చెత్త, చెదారంతో నిండిన షాపింగ్ కాంప్లెక్స్

- మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్
- అద్దె వసూళ్లపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదా..
- పెచ్చులూడుతున్న శ్లాబ్‌లు
- ఖాళీగానే సగం షాపులు

పార్వతీపురం టౌన్:

ఎప్పుడు కూలిపోతాయో తెలియని షాపులు.. పెచ్చులూడుతున్న శ్లాబ్‌లు.. కనిపించని మౌలిక సదుపాయాలు.. పార్వతీపురం పురపాలక సంఘ షాపుల దుస్థితి ఇది. ప్రతీ ఏటా రూ.కోటికి పైగా ఆదాయం వచ్చే ఈ షాపులపై అధికారులు శీత కన్ను వేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. బయటకు వెళ్లలేక, ఉన్న షాపుల్లో వ్యాపారం చేయలేక అద్దెదారులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరుకుంది. కొన్ని షాపుల్లో గోడలు బీటలు వారడం, మరికొన్ని షాపుల్లో శ్లాబ్ పెచ్చులు ఊడడం, కొన్ని షాపులు పూర్తిగా శిథిలం కావడంతో అద్దెదారులు వాటిని మూసేశారు. షాపులు తమ పేరున ఉండేందుకు మాత్రమే అద్దె చెల్లిస్తున్న పరిస్థితి నెలకొంది. వీటికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నప్పటికీ అద్దె వసూళ్లు చేయడంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై చూపించడం లేదని అద్దెదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● బైక్ పార్కింగ్‌కు అడ్డాగా..

షాపింగ్ కాంప్లెక్స్ పక్కన కూరగాయల మార్కెట్ ఉండడంతో కూరగాయలు కొనుగోలుదారులు బైక్ పార్కింగ్ చేసుకోవడానికి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగించుకోవల్సిన పరిస్థితి నెలకొంది. పశువులు ఉంచేందుకు పశు శాలగా రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగించుకుంటున్నారు. మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ షాపింగ్ కాంప్లెక్స్ అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించకపోవడంతో ఓ పక్క స్థానికులు, మరో పక్క అద్దెదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● అన్నీ అక్కడే..

షాపింగ్ కాంప్లెక్స్ లోపల పలు దుకాణాలు పూర్తిగా మూసివేసి ఉండడం, నిర్మానుష్యంగా ఉండడంతో రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. నెహ్రూ మార్కెట్‌లో వినియోగించిన చెత్తను అక్కడే వేయడం, మూత్ర విసర్జన వంటి కార్యకలాపాలు చేపడుతుండడంతో తీవ్ర దుర్గంధం ప్రబలుతుంది. ఫలితంగా రోగాలు ప్రబలే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెచ్చులూడిన శ్లాబ్

● ఎన్నిసార్లు విన్నవించుకున్నా...

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పరిస్థితిపై ఎన్నో మార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారని అద్దెదారులు వాపోతున్నారు. క్రమం తప్పకుండా అద్దె చెల్లించాలని చెబుతారే తప్ప అభివృద్ధి చేసే పరిస్థితి లేదని వాపోతున్నారు. అభివృద్ధి చేయకపోయినా కనీసం మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు. సమస్య పరిష్కారం కానట్లైతే సోమవారం జరగనున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌కు తమ సమస్యను తెలుపుతామని వారు పేర్కొన్నారు.



మూసివున్న దుకాణ సముదాయాలు

మరమ్మతు పనులు చేపడతాం..



పార్వతీపురం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో మరమ్మతు పనులను చేపడతాం. కౌన్సిల్ ఆమోదంతో నిధులు కేటాయించి వాటి మరమ్మతు, అభివృద్ధి పనులు చేసే విధంగా చర్యలు చేపడతాం. సమస్యను గుర్తించాం. అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేశాం.

– సీహెచ్ వెంకటేశ్వరులు, మున్సిపల్ కమిషనర్, పార్వతీపురం

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సీతానగరం: రాజ్యాంగం కల్పించిన పంచాయతీరాజ్ హక్కుల ద్వారా ప్రజలకు స్వయం ప్రతిపత్తితో మెరుగైన సేవలందించడం జరుగుతుందని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికార సిబ్బందితో మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ ఎం.బాబ్జీ మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన ఉండాలన్న సంకల్పంతో దివంగత సీఎం ఎన్‌టీ రామారావు మాండలిక వ్యవస్థ తెచ్చారని అన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ఇళ్ల వద్దనే ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలు అందించే విధంగా పంచాయతీరాజ్ వ్యవస్థను తెచ్చారని అన్నారు. అనంతరం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులను సత్కరించారు. ఎంపీటీసీలు ఎంపీడీఓ త్రివిక్రమరావును సత్కరించారు. కార్యక్రమంలోఎంఈఓలు సూరిదేముడు, ఎం.వెంకటరమణ, మండల పరిషత్ ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ, ఉపాధి హామీ పథకం ఏపీఓ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

99 మందికి 500 పైబడి మార్కులు



బలిజిపేట ఉన్నత పాఠశాల

బలిజిపేట: పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 500మార్కులు పైబడి 99మందికి రావడం ఒక ప్రభంజనంగా మారింది. మండలంలో 9 ప్రభుత్వ పాఠశాలలు, ఒక కేజీబీవీ పాఠశాల ఉన్నాయి. వీటిలో 382మంది పది పరీక్షలకు హాజరవగా 359మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 94శాతం ఫలితాలు సాధించారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి అత్యధికంగా 587మార్కులతో పెదపెంకి ఉన్నత పాఠశాలకు చెందిన కోట సందీప్ ప్రథమ స్థానంలో ఉండగా, నారన్నాయుడువలస ఉన్నత పాఠశాలకు చెందిన ఎ.ధరణి 585మార్కులు సాధించి ద్వితీయ స్థానం పొందడం పొందారు. మొత్తం మీద 500మార్కులు సాధించిన వారు 99మంది విద్యార్థులు విశేషం. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఫలితాలు రావడం తల్లితండ్రులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 500మార్కులు దాటి వచ్చిన వారిలో పెదపెంకి ఉన్నత పాఠశాలలో 13మంది, చిలకలపల్లిలో 8మంది, అరసాడ ఉన్నత పాఠశాలలో 9మంది, అజ్జాడలో ముగ్గురు ఉన్నారు. అలాగే నారాయణపురంలో 8మందికి, గలావల్లి ఉన్నత పాఠశాలలో ఇద్దరు, నారన్నాయుడువలసలో ఆరుగురు, వంతరాం ఉన్నత పాఠశాలలో 12మంది, కేజీబీవీ పాఠశాలలో 11మంది, బలిజిపేట ఉన్నత పాఠశాలలో 27మంది 500 మార్కులకు పైబడి వచ్చాయి. అరసాడ, అజ్జాడ, పెదపెంకి ఉన్నత పాఠశాలలో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ఇదిలా ఉండగా 100 రోజుల ప్రణాళికతోనే మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని ఎంఈఓ సింహాచలం తెలిపారు.

వెంకంపేట గోరీల జంక్షన్ వద్ద శిథిలావస్థకు చేరిన రహదారి



ఆదమరిస్తే ..అంతే సంగతులు

పార్వతీపురం శివారులోని వెంకంపేట గోరీల జంక్షన్ నుంచి మండలంలోని వెంకంపేట, కొత్తపట్నం, చినబొండపల్లి, పెదబొండపల్లి, సంగంవలస, ములగ గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారింది. అలాగే ఒడిశాలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు ప్రధానమైన రహదారి శిథిలావస్థకు చేరి గోతుల మయంతో అధ్వానంగా తయారైంది. ఈ మార్గాల్లో ప్రతీ రోజు రాకపోకలు సాగించే వాహన చోదకులు రాళ్లు తేలిన గుంతల కారణంగా అదుపు తప్పి నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు పనులు ప్రారంభించి ప్రాథమిక దశలోనే నిధుల బకాయిలు మంజూరు కాకపోవడంతో రోడ్డు పనులు నిలిచిపోవడంతో నిత్యం వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – పార్వతీపురం రూరల్



చినబొండపల్లి, కొత్తపట్నం గ్రామాల మధ్య ఒక వైపు పూర్తిగా పాడైన రహదారి

● కొవ్వొత్తుల ర్యాలీ



జమ్ము కశ్మీర్‌లోని ఉగ్ర దాడిని నిరసిస్తూ పార్వతీపురం పట్టణ బార్ అసోసియేషన్ సభ్యులు గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పార్వతీపురం రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు నుంచి మేదర వీధి జంక్షన్ వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగ్ర దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు ఉగ్ర వాదుల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పలువురు న్యాయ వాదులు పాల్గొన్నారు. – పార్వతీపురం టౌన్

ఉగ్రదాడిపై మహిళల ఆగ్రహం



ర్యాలీలో పాల్గొన్న మహిళలు

సాలూరు: జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ స్ఫూర్తి మహిళా మండలి డైరెక్టర్ బి.రాధ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో మెయిన్ రోడ్డు మీదుగా నిరసన ర్యాలి చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉగ్రవాదులు మానవత్వం మరచి మనుషుల ప్రాణాలు తీసేయడం దారుణమన్నారు. ఇటువంటి దాడులు జరగకుండా కేంద్రం తగు పటిష్ట చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు. సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి

సాలూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు అన్నారు. సాలూరులో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గంట కృష్ణ అధ్యక్షతన గురువారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ కార్మిక వర్గాలను అణగదొక్కుతుందన్నారు. వివిధ సంఘాల నాయకులు నాయుడు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొట్లాటలో వ్యక్తికి గాయాలు

పార్వతీపురం టౌన్: కొట్లాటలో వ్యక్తికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మునిసిపాలిటీలో కొత్తవలసకు చెందిన సాలాపు ప్రభ ఆటో డ్రైవర్. తన కుమార్తె రజస్వల వేడుకలు ఘనంగా చేయాలని భార్య శిరీష కుమార్తెను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. ప్రభ అత్తవారింటికి వెళ్లి పిలవగా బావమరిది పొట్నూరు వాసు, అత్త చిన్నమ్మ, భార్య శిరీష దాడి చేసి రాయితో కొట్టారు. దీనితో ప్రభకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన ప్రభ స్నేహితుడు తులసి పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకొని రాగా వైద్యులు చికిత్స అందించారు. జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు ఏఎస్‌ఐ నిమ్మకాయల భాస్కరరావు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

మన్యంలో టెన్త్ ఫలితాలు భేష్

పార్వతీపురం టౌన్: పదో తరగతి ఫలితాల్లో వరుసగా మూడోసారి పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచి హ్యాట్రిక్ సాధించడం పట్ల ఎంఈఓ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మై స్కూల్ మై ప్రైడ్ అనే చక్కని కార్యక్రమాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ రూపొందించి, ప్రతి హైస్కూల్‌కు స్పెషల్ ఆఫీసర్‌ను నియమించి పర్యవేక్షణ చేయించడం ద్వారా పదో తరగతిలో మూడోసారి కూడా ప్రథమ స్థానం సాధించేందుకు దోహద పడిందన్నారు. ఈ ఏడాది విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. విద్యా శాఖ అధికారులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయుల కృషి ఈ ఫలితాలకు కారణమన్నారు.

సరదాల మాటున ప్రమాదాలు



తోటపల్లి కుడి కాలువలో ఈత కొడుతున్న చిన్నారులు

- చెరువులు, నేల బావులు, నిర్మాణాలు, గుంతల వైపు వెళ్లనీయొద్దు..
- వేసవి సెలవుల్లో పిల్లలపై దృష్టి పెట్టండి

గరుగుబిల్లి: విద్యా శాఖ పాఠశాలలకు వేసవి సెలవులను ప్రకటించింది. దీంతో ఎక్కువ సమయం పిల్లలు ఆడుకోవడానికి ఇష్టపడుతున్నారు. తల్లిదండ్రులు ఎంతచెప్పినా వినకుండా స్నేహితులతో కలిసి బయటకు వెళ్లి హాయిగా గడపాలనుకుంటున్నారు. ఈ ఆనంద సమయాల్లో ఎన్నో అనర్థాలు పొంచి ఉన్నాయనే విషయాన్ని తల్లిదండ్రులు గమనించి ఒక కంట కనిపెట్టాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా, పిల్లలు ప్రమాదాల బారినపడే అవకాశం ఉంటుంది. ఇంతవరకు పాఠశాలలో చదువులతో గడిపిన విద్యార్థులకు పాఠశాలలకు సెలవులు కావడంతో వారి ఆనందానికి హద్దు ఉండదు. చిన్నారులు ఇంటికి పరిమితం కాకుండా తోటి పిల్లలు, స్నేహితులతో కలసి ఆడుకోవడానికి ఎక్కువగా ఇష్టపడుతుంటారు. వేసవిలో ఎండకు అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉంది. పిల్లలను ఇంటి ఆవరణలో, పరిసర ప్రాంతంలో ఆడుకునేలా, చదువుకునేలా తల్లిదండ్రులు అవసరమైన చర్యలు చేపట్టాలి. మధ్యాహ్న సమయంలో వారిని ఇంటిపట్టునే ఉండేలా చూడాలి.



ఎస్ఆర్ పేటలో క్రికెట్ ఆడుతున్న విద్యార్థులు

తల్లిదండ్రులు పర్యవేక్షించాలి

పిల్లలపై కోపగించుకోకుండా ప్రేమతో వారిని దగ్గరికి తీసుకోవాలి. వడదెబ్బ తగలకుండా పిల్లలను వీలైనంతవరకు ఇంట్లో ఉండే విధంగా కుటుంబ సభ్యులు పర్యవేక్షణ చేయాలి. ఎక్కువ శాతం ఇంట్లో తయారు చేసే పదార్థాలు మాత్రమే పిల్లలకు ఆహారంగా తీసుకునేందుకు సిద్ధం చేయాలి. బయట దొరికే పదార్థాలను పిల్లలకు అలవాటు చేస్తే రోగాల బారిన పడే అవకాశం ఉంది.

– దత్తి అప్పలనాయుడు, ఎంఈఓ, గరుగుబిల్లి

వాహనాలతో జాగ్రత్త

ద్విచక్ర వాహనాలు, సైకిళ్లంటే పిల్లలకు మోజు ఎక్కువ. ఇంట్లో చెప్పకుండా వాటిని నడుపుతూ రోడ్డెక్కి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో చిన్నారులను మోటారు బైక్‌లు, సైకిళ్లకు దూరంగా ఉంచాలి. అవసరమైతేనే పెద్దల పర్యవేక్షణలో వాహనాలు నడపడం నేర్పించాలి. పిల్లలను ఎక్కువ సమయం ఎండలో తిరిగితే ఒక్కోసారి అనారోగ్యానికి గురవ్వవచ్చు.

సెల్‌ఫోన్‌లకు బానిసలుగా..

సెల్‌ఫోన్‌లలో కార్టూన్ వీడియోలు చూస్తూ స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లకు బానిసలుగా మారుతున్నారు. ఈ క్రమంలో సెల్‌ఫోన్‌ల పిచ్చి పట్టుకునే ప్రమాదం ఉంది. ఇది చిన్న పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పిల్లలు మారాం చేస్తున్నారని పెద్దలు ఫోన్లు ఇవ్వడం అలవాటు చేస్తున్నారు. రాను రాను ఇది పెద్ద సమస్యలా మారుతుంది. ఎంతలా అంటే ఫోన్ లేకపోతే తిండి కూడా తినడం లేదు. ఇది పిల్లల మానసిక ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. ఇలా స్మార్ట్ ఫోన్లు వాడుతూ ఉంటే పిల్లలు ఆందోళన, నిరాశకు గురయ్యే ప్రమాదం ఉంది.

కాలువలు, చెరువులతో ప్రమాదాలు

వేసవి కాలంలో ఎండ తీవ్రతను తాళలేక పిల్లలు ఈతపై సరదా చూపుతూ ప్రమాదాలకు గురవుతుంటారు. వీలైనంత వరకు పిల్లలను చెరువులు, కాలువలు, బావుల వద్దకు పంపకూడదు. ఈత నేర్పాలనుకుంటే తల్లిదండ్రులే పిల్లలను వెంట తీసుకెళ్లి కొంత సమయం వరకు ఈత నేర్పటం ఉత్తమం. అలాగే నిర్మాణాలు జరిగే ప్రాంతాల్లో ప్రమాదకరమైన గుంతలు ఉంటాయి ఆదమరిచి ఆటల్లో పడి పిల్లలు గుంతల్లో పడే ప్రమాదాలు ఉంటాయి.

గృహనిర్మాణాలు వేగవంతం

సీతంపేట: గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ పి.ధర్మచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని పెదరామ, వాబ, మొగధార గూడ గ్రామాలను గురువారం సందర్శించారు. పీఎంఏవై, పీఎం జన్‌మన్ లబ్ధిదారులకు గృహమంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణాలు త్వరగా చేపడితే బిల్లులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.కృష్ణారావు, తహసీల్దార్ అప్పలరాజు, హౌసింగ్ ఏఈ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.